# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-05-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కిర్గిజిస్థాన్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సురక్షితంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ -ఏపీఎన్ఆర్టీయస్ ఉన్నతాధికారి హేమలతా రాణి తెలిపారు.**
2. **ఓట్ల లెక్కింపుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు.**
3. **వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేర్కొన్నారు.**
4. **వేసవి సెలవులతో పాటు వారాంతపు సెలవులు రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.**
5. **అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.**

==========================

కిర్గిజ్ స్తాన్ లోని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సురక్షితంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ -ఏపీఎన్ఆర్టీయస్ ఉన్నతాధికారి హేమలతా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. కిర్గిజ్ స్తాన్ దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్ వ ఆదేశాల మేరకు తెలుగు విద్యార్థుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కిర్గిజ్‌స్థాన్‌లో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల విద్యార్థులతో సురక్షిత ప్రదేశాలలో ఉన్నారని సమాచారం అందించారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు ఏపీఎన్ఆర్టీఎస్ కు చెందిన 863 2340678 లేదా 8500027678 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే ఏపీఎన్ఆర్టీఎస్ ఇమెయిల్స్ info@apnrts.com; helpline@apnrts.com ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

--------------------------

ఓట్ల లెక్కింపునకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు అధికారులను ఆదేశించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై నిన్న ఢిల్లీరావు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి

ప్రత్యేక మార్గాలు ఉండాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో శాసనసభకి 14 బల్లలు, పార్లమెంటుకు 14 బల్లలు చొప్పున 28 బల్లలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ దిల్లీరావు పేర్కొన్నారు.

---------------------------

వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.వీ.ఆర్.ఎస్ఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రంథాలయాల్లో జూన్ 7వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుందని పుస్తకపఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులతో పాటు చెస్, క్యారమ్స్ వంటివి నేర్పిస్తున్నామని వివరించారు.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు బిపిన్ చంద్రపాల్ వర్ధంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటున్నారు. 1858 నవంబర్ 7న జన్మించిన బిపిన్ చంద్రపాల్ స్వాతంత్ర్య సమరంలో చురుకైన పాత్రను పోషించి, దేశప్రజలను జాగృతం చేశారు. లాల్, బాల్, పాల్ త్రయంలో ఒకరైన బిపిన్ చంద్రపాల్ స్వదేశీ వస్తువులు వినియోగించాలని ప్రజలను ప్రోత్సహించారు.

---------------------------

తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఈరోజు సున్నపు కుండల వేషంలో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటున్నారు. తలపై సున్నపు కుండలను పెట్టుకుని ఆలయం చుట్టూ తిరుగుతూ వాటిని పగులగొట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచే గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రేపు ముఖ్యమైన గంగజాతర జరుగనుంది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

---------------------------

గుంటూరు జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పి తుషార్ దూడి తెలిపారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన బ్యాలెట్ బాక్సులను నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచామన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం, చుట్టుప్రక్కల ప్రాంతాలలో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. గుంటూరు జిల్లాలోని పెట్రోల్ బంకులలో పెట్రోల్, డీజిల్ సీసాలలో విడిగా అమ్మడంపై నిషేధం విధించామని పేర్కొన్నారు.

---------------------------

వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో రావడంతో తిరుమలలో అధిక రద్దీ నెలకొంది. భక్తులకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సర్వ దర్శనానికి దాదాపు 24 గంటల సమయం పడుతోందని టీటీడీ ఒక ప్రకటనలో

తెలిపింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. రద్దీ దృష్ట్యా క్యూ లైన్లలోని భక్తులకు ఆహారం, పాలు, త్రాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో శ్రీవారి సేవకులతో అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నామని తెలిపింది. భక్తుల రద్దీ క్రమేపి పెరుగుతున్న దృష్ట్యా తిరుమల యాత్రకు వచ్చే భక్తులు పునరాలోచన చేయాలని టిటిడి తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇసుక త్రవ్వకాలు, తరలింపుపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. జిల్లాలో ఉన్న ఇసుక దిబ్బలను అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని కడియం, పెరవలి, నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో ఇసుక రీచ్ లని పరిశీలించామని అన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ప్రదేశంలోనే ఇసుకను సేకరించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అధికంగా తరలించకూడదని, తరలిస్తే సంబంధిత వాహనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

పారిశ్రామిక శిక్షణా సంస్థ- ఐటీఐలో శత శాతం అడ్మిషన్లు జరిగేలా ప్రణాళిక రూపొందించామని కాకినాడ జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి తెలిపారు. కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో నిన్నసంబంధిత అధికారులతో ఒకేషనల్ గైడెన్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ చదవడం వల్ల మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఐటీఐ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు జూన్ పదో తేదీ వరకూ స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ కోసం రిజిస్టర్ కావాలని వసంతలక్ష్మి కోరారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 28 సెకన్లు....

---------------------------

విశాఖపట్నంలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఈనెల 23వ తేదీన అప్పన్న స్వామికి రెండవ విడత చందన సమర్పణ జరగనుందని ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సింహగిరిపై చందనం అరగదీత కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఆలయంలోని బేడామండపంలోని రాతి సానలపై సిబ్బంది చందనం చెక్కలను అరగదీసి శ్రీగంధాన్ని సేకరించారని ఇప్పటివరకు 37 కిలోల చందనం సమకూరినట్లు తెలిపారు.

---------------------------

అనంతపురం జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. నిన్న జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. క్షేత్రస్థాయి

అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేసి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతోందని, కౌంటింగ్ రోజు అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

---------------------------

విజయవాడలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈరోజు ఉదయం నగరంలోని గుణదల, మాచవరం, సత్యనారాయణపురం, వన్‌టౌన్, ప్రాంతాలలో వాహనాల తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలు విధించామని, అలాగే ఎటువంటి రికార్డులు లేని  వాహనాలు సీజ్ చేసినట్లు పోలీసులు వివరించారు.

=======================